


# ఆస్తిపన్ను బకాయి రూ.5 వేల కోట్లు

**-జిహెచ్ఎంసికి పదేళ్ల నుంచి చెల్లించని సర్కార్**
**-దాదాపు 1600 ప్రభుత్వ భవనాల నుంచి కోట్లల్లో పెండింగ్**
**-కేంద్ర ప్రభుత్వ భవనాల నుంచి రూ.2వేలకోట్లకు పైనే నోటీసులు జారీ చేస్తున్న జిహెచ్ఎంసి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** వ్యాపారులు, సామాన్య ప్రజల నుంచి వివిధ రకాల పన్నులను ముక్కుపిండి వసూలు చేసే రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి సుమారు రూ.5 వేల కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ బకాయి పడింది. గడిచిన సుమారు పదేళ్ల నుంచి సర్కారు కు జీహెచ్ఎంసీ పరిధిలో నున్న సుమారు 1600 భవనాలకు సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకపోవటంతో ప్రస్తుతం ఆ బకాయిలు రూ.5 వేల కోట్లకు పేరుకుపోయినట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ కనీసం సకాలంలో ఉద్యోగులకు జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్లతో పాటు వివిధరకాల పనులు చేసిన కాంట్రాక్టర్లకు సైతం బిల్లులు చెల్లించక అష్ట కష్టాలు పడుతుంది. తరుచూ వివిధ రకాల అభివృద్ధి పనుల కోసం సచివాలయంలో సమీక్షలకు వెళ్లే అధికారులు సైతం ఈ బకాయిల కోసం ప్రశ్నించేందుకు జంకుతున్నట్లు సమాచారం. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015 నుంచి 2023 వరకు స్తోమతను మించి అప్పులు తెచ్చి మరీ రూ. 6553 కోట్ల అప్పులతో అభివృద్ధి పనులు చేపట్టింది. చేసిన అప్పులకు గాను ప్రతినెల ఆసలు, మిత్తీలతో కలిపి రూ.140 కోట్లు చెల్లిస్తుంది. దీనికి తోడు ప్రతి నెల చివరి తేదీల్లో సుమారు రూ.136 కోట్లు జీతభత్యాలు చెల్లించాల్సి వస్తుంది.

**ఆర్థిక సహాయంగా 3.30కోట్లు ..**

సర్కారు జీహెచ్ఎంసీకి రూ.3 వేల 30 కోట్లను ఆర్థిక సహాయంగా అందించినందుకు డిసెంబర్, జనవరి మాసాలకు సంబంధించిన జీతాల చెల్లింపులకు ఇబ్బంది తలెత్తలేదు. ఆస్తి పన్నుకు సంబంధించిన బకాయిలను పేర్కొనకుండానే ఆర్థిక సహాయంగా సర్కారు ఈ నిధులను అందజేసింది. అయితే ఇప్పటి వరకు బకాయిగా ఉన్న రూ.5 వేల కోట్లను కూడా సర్కారు చెల్లిస్తే బల్దియాకు ఆర్థిక సంక్షోభం నుంచి కొంత మేరకైనా ఊరట లభిస్తుందన్న వాదనలున్నాయి. కానీ వర్తమాన ఆర్థిక సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్న రూ.2 వేల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్‌లో ఇప్పటి వరకు రూ.1500 కోట్ల మాత్రమే వసూలు కాగా, మిగిలిన రూ.500 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ ను మార్చి నెలాఖరు కల్లా పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఈ క్రమంలో ప్రతి ఆర్థిక సంవత్సరం కరెంట్ డిమాండ్ గా ఉండే సుమారు రూ.6 వేల కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ లో కొంతమేరకైనా వసూలు చేసుకోవాలన్న వ్యూహాన్ని జిహెచ్ఎంసి సిద్ధం చేసుకుంది. ఇందులో భాగంగా గ్రేటర్ లోని మొత్తం 30 సర్కిళ్ల పరిధిలో ఉన్న దాదాపు 1600 సర్కారు భవనాలకు ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాలంటూ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన దాదాపు 240 భవనాలకు సంబంధించి ఏళ్ల తరబడి సుమారు రూ.2 వేల ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలున్నట్లు సమాచారం. వీటికి సంబంధించి సుప్రీంకోర్టులో కేసులున్నట్లు విశ్వసనీయ సమాచారం .అలాగే జీహెచ్ఎంసీ పరిధిలో జరుగుతున్న ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి కూడా జీహెచ్ఎంసీకి రూ.3 వేల కోట్ల రావల్సి ఉన్నాయి. వీటిలో రోనాల్డ్ రోస్ కమిషనర్ గా ఉన్నపుడు రూ.300 కోట్లు తెప్పించినట్లు తెలిసింది. ఈ బకాయితో పాటు వాహనాల రిజిస్ట్రేషన్ కు సంబంధించి మోటారు వెహికల్ ట్యాక్స్, గ్రేటర్ పరిధిలో వసూలవుతున్న ప్రొఫెషనల్ ట్యాక్స్ కు సంబంధించి కూడా సర్కారు నుంచి రూ. వంద కోట్లలో బకాయిలున్నట్లు సమాచారం

# ఫుట్‌పాత్‌లపై ఆక్రమ నిర్మాణాలు తొలగింపు

**-రోడ్డును ఆక్రమించిన 68 షెడ్లపై కొరడా**



**అత్తాపూర్ ఫిబ్రవరి15,ప్రభాతవార్త :** ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ హెచ్చరించారు. శనివారం డిసి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో శనివారం ఓల్డ్ కర్నూల్ రోడ్డులోని కాటేదాన్, బుద్వేల్ ప్రాంతాలల్లో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న 68 షెడ్ల జిహెచ్ఎంసి అధికారులు తొలగించారు. ప్రాంతంలో ట్రాఫిక్ సౌలభ్యం, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ముందుగా వ్యాపారస్తులకు సమాచారం ఇచ్చి, స్వచ్ఛందంగా తొలగించుకునే అవకాశం కల్పించగా, కొంత మంది వ్యాపారస్తులు షెడ్లు, స్టాళ్లు స్వయంగా తొలగించుకున్నారు. మిగతా అక్రమంగా కొనసాగుతున్న వ్యాపారాల షెడ్లను భారీ పోలీసు బందోబస్తు మధ్య జిహెచ్ఎంసి అధికారుల బృందం తొలగించింది. ఈ సందర్భంగా డిసి రవి కుమార్ మాట్లాడుతూ....అధికారుల సూచనల మేరకు నగరంలోని రహదారులపైన ఏర్పాటు చేసిన షెడ్ల తొలగించి, రహదారి విస్తరణకు అనుగుణంగా చర్యలు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకోకుండా వ్యాపారాలు చేసుకోవాలని ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని ఇతరలకు ఇబ్బంది కల్గిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిహెచ్ఎంసి అధికారులు ముందుగా సమాచారం అందించినప్పుడే తొలగించుకోవాలని లేకుండా తాము తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## వాలిబాల్ పోటీలను ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



క్రీడా పోటీల ప్రారంబోత్సవంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, చిత్రంలో ఇతర నేతలు

**తార్నాక, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం ప్రారంభించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జిల్లా నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం హామీల అమలు నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూ, ప్రతి ఒక్కరూ ప్రశ్నించే దిశగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఓయూ వేదికగా మాట్లాడాల్సిన మేధావులంతా మూగబోయారని దుయ్యబట్టారు. ఓయూ అధ్యాపకుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచి నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టారని విమర్శించారు. కనీస విషయ పరిజ్ఞానం లేని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల పాలిట శాపమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, చిరుమల్ల రాకేశ్, బీఆర్ఎస్ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, నేవూరి ధర్మేందర్ రెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, తొట్ల స్వామియాదవ్, మంద సురేశ్, పడాల సతీశ్, కడారి స్వామియాదవ్, టైగర్ రఘురాం, అవినాశ్, చందు, వెంకట్, నవీన్ గౌడ్, జంగయ్య తదితరు పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వద్ద బిఎండబ్ల్యూ కారు బీభత్సం..

**పంజగుట్ట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** :జూబ్లీహిల్స్‌లో కారు బీభత్సం సృష్టించింది. శనివారం వేకువ జామున అతివేగంగా వచ్చి కారు డివైడర్‌ను ఢీకొంది. ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. జూబ్లీహిల్స్ చెక్ ఫాస్ట్ ట్రాఫిక్ పోలీస్ బూత్ దిమ్మెల్ని అతివేగంతో ఢీకొట్టడంతో అక్కడ బీభత్స వాతావరణం నెలకొంది. అదుపుతప్పి డివైడర్ దిమ్మెల్ని ఢీకొనడంతో పగిలిన కారు టైర్, ఆయిల్ ట్యాంకర్ పగిలిపోయాయి. మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేసి ఉంటాడనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేశారు. కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో కారు దిగి పరారైన డ్రైవర్. సంఘటనాస్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి



సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా తన నివాసం నుండి ర్యాలీగా వెళ్తున్న వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం అంబర్‌పేటలో జరిగిన ఈ ర్యాలీ తన నివాసం నుండి మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు ప్రారంభించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వీరన్న నాయక్ ఆధ్వరనయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రోహిన్ రెడ్డి, పిసిసి నేతలు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, లక్‌పతి యాదగిరిగౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, అప్సర్ యూసఫ్, బాగ్‌అంబర్‌పేట డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, గోల్నాక కంటెస్టెడ్ కార్పొరేటర్ రామ్మోహన్ రావు తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ బాగ్‌అంబర్‌పేట రెడ్‌బిల్డింగ్ చౌరస్తా నుండి శ్రీచైతన్య కాలేజ్, యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా, శివం రోడ్డు, భవాని బుక్ స్టోర్ నుండి అయ్యప్ప టెంపుల్ మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్, నల్లకుంట డివిజన్ ప్రెసిడెంట్ లక్ష్మన్, మహేందర్, హరి, అబుజిత్ ,రాంజీ, ఫుల్ సింగ్, బాలు నెహ్రూ నాయక్, అబ్బు, రమేష్, కృష్ణ, గోల్యా, మోత రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి గుంతలో పడి బాలుడి మృతి

**సైదాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** ఆడుకుంటూ నీటి గుంతలో పడి అయిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మాడుగుల మండలం రామ దుగ్యాల గ్రామానికి శ్రీనునాయక్ కుటుంబంతో కలిసి నగరంలోని ఓల్డ్ సంతోష్ నగర్ లోని ఒక అపార్ట్ మెంట్ లో వాచ్ మెన్ గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. శ్రీను నాయక్ అయిదేళ్ల కుమారుడు జై శివన్ శనివారం ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటూ సమీపంలో నిర్మాణం లో ఉన్న మరో ఇంటి వద్దకు వెళ్ళాడు. పిల్లర్ల కోసం తీసిన గుంత లోని నీటిలో ప్రమాద వశాత్తు పడిపోయాడు. శివన్ నీటిలో పడి పోయిన విషయాన్ని గుర్తించి బయటకు తీసేసరికే మృతి చెందాడు. కాగా పిల్లర్ల కోసం గుంతలు తీసే సమయంలో పక్క ఇంటి కనెక్షన్ పైప్ పగిలి పోయింది. శనివారం ఉదయం నీళ్ల వదలడంతో గుంత మొత్తం నీటితో నిండి పోయింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# హైదరాబాద్ వార్త

## నేటి నుంచి జిహెచ్ఎంసి పరిధిలో

# కులగణన సర్వే

**-నమోదు చేసుకోని వారికి 28వరకు అవకాశం -ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు "040-21111111"**
**-ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటలవరకు పేర్ల నమోదుకు అవకాశం -ఇంటికి వెళ్ళి వివరాలు సేకరించనున్న ఎన్యూమరేటర్లు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** కుల గణనలో ఇప్పటి వరకు నమోదు కానీ వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111 ను ఏర్పాటు చేసారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుంది. ఇప్పటి వరకు కుల గణన లో నమోదు కానీ కుటుంబ సభ్యులు మాత్రమే కాల్ సెంటర్ కు కాల్ చేసి వారి , మొబైల్ నెంబర్, అడ్రస్ తో పాటుగా పోస్టల్ పిన్ కోడ్ నెంబర్ ను తెలియజేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో కాల్ సెంటర్ లో కాల్ వచ్చినప్పుడు ఆపరేటర్ చేయవలసిన నియమ నిబంధనలు గురించి శనివారం కంప్యూటర్ ఆపరేటర్లకు కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ అవగాహన కల్పించారు. కాల్ సెంటర్‌లో ఆపరేటర్ ప్రవర్తించాల్సిన పద్దతి పై వివరించారు. ఈ కాల్ సెంటర్ జిహెచ్ఎంసి పరిధితో పాటు ఇతర జిల్లాల నుండి వచ్చిన కాల్స్ కూడా స్వీకరించి, అట్టి వివరాలను సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఫార్వర్డ్ చేస్తారు. అయితే కాల్ చేసే వ్యక్తి పూర్తి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఫోన్ నెంబర్, పూర్తి అడ్రస్, పిన్ కోడ్ నెంబర్ తెలియజేయాల్సి ఉంటుంది. కాల్ సెంటర్ కు కాల్ వచ్చిన సందర్భంలో ఆపరేటర్ ముందుగా అడగాల్సిన అంశాలను ఈ శిక్షణ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వివరించారు. ఈ నేపథ్యంలో కాల్ సెంటర్ ద్వారా పేరు, వీధి, గ్రామం, మొబైల్ నెంబర్, ఇంటి నెంబర్, పట్టణాలలో అయితే సర్కిల్ లేదా వార్డు నెంబర్ వివరించిన పక్షంలో అడ్రస్ ప్రకారం ఎన్యుమరేటర్ వారి ఇంటికి వెళ్లి కులగణన చేస్తారు. మొబైల్ నెంబర్ తో సెర్చ్ చేసి సంబంధిత వ్యక్తి పాత డేటా బేస్ లో నమోదు అయ్యారా లేదా వివరాలు ఉన్నాయా అన్నది పరిశీలించి, లేని పక్షంలో సంబంధిత వ్యక్తి, పేరు, అడ్రస్ అడుగుతారు. ముందుగా జీహెచ్ఎంసీనా లేదా నాన్ జీహెచ్ఎంసీనా అన్న వివరాలు అడుగుతారు. జీహెచ్ఎంసీ పరిధి కానటువంటి వారైతే మున్సిపాలిటీ వార్డు నెంబర్, అడ్రస్, గ్రామం అయితే మండలం అడుగుతారు. ఆయా వివరాలను తెలియజేసి పక్షంలో ఎన్యుమరేటర్ ఇంటి వద్దకు వచ్చి కుల సర్వే వస్తారు. ఇప్పటి వరకు కులగణన సర్వేలో నమోదు చేసుకోని వారు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలుపుతున్నారు.

# రేపటితో ముగియనున్న నుమాయిష్

**-ఏడాది వరకు వేచి చూడాల్సిందే...సందర్శకులు**

**గోషామహల్, ఫిబ్రవరి 15ప్రభాతవార్త:** విద్యుత్ కాంతుల వెలుగు జిలుగులు....కళ్లు చెదిరే ఇంటీరియర్ డెకరేషన్...భారీ పరిశ్రమలుమొదలుకొనికుటీర పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన....ప్రత్యేక ఆకర్షణగా నిలిచే హస్తకళా రూపాలు..అలరించే చుక్‌చుక్ రైలు....గాలిలో తేలిపోయే అనుభూతిని కలిగించే రంగుల రాట్నం..నోరూరించే తినుబండారాలు....తదితర అన్ని హంగులతో నడుస్తున్న నుమాయిష్'సందర్శకులు విశేషంగా అలరించిది. గతనెల3 తేదిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. దీంతో సందర్శకుల తాకిడి పెరిగిపోయింది. స్టాళ్ల నిర్వాహకుల వినతి మేరకు రెండు రోజుల పాటు అదనంగా పొడగించారు. 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన'లో సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటుంది. నగర ఖ్యాతిని విదేశాలకు సైతం వ్యాప్తి చేస్తుంది. ఇతర ప్రాంతాలనుంచి తరలివచ్చే సందర్శకులు ఎగ్జిబిషన్‌ను తిలకించి ఆనందాన్ని పొందుతున్నారు. ప్రపంచమే ఒక గ్లోబల్ విలేజ్‌గా మారిన నేటి తరుణంలో 84వ నుమాయిష్ ప్రదర్శన సందర్శ కులకు ప్రతియేటా ఫిబ్రవరి15వ తేదిన ముగిసే ఎగ్జిబిషన్ ఫిబ్రవరి17వ తేది వరకు పొడిగించారు. ప్రైవేట్ సంస్థలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన స్టాళ్లు కూడా ఎంతో వినియోగదా రులను ఆదరణను చూరగొంటున్నాయి. పేరొందిన బ్యాంక్‌లు, వివిధ ప్రభుత్వశాఖలు పేరొందిన కార్పొరేట్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయినెలకొల్పిన స్టాళ్లలో తమ సరికొత్త ఉత్పత్తులను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. పేరొందిన ఎలక్ట్రానిక్స్ స్టాళ్లతోపాటు కొనుగోలుదారులకు ఎంతో వెసులు బాటు కల్పిస్తున్నారు. మరి కొన్ని సంస్థలు ప్రత్యేకంగా పలు ఉత్పత్తుల కొనుగోలుపై డిస్కౌంట్ రేట్ల ద్వారా అమ్మకాలు చేస్తు న్నారు. అలంకరణ సామాగ్రి, ఇంటీరియర్, ఆర్టిక ల్స్, వస్త్రాలు, క్రాకరీ ఉత్పత్తులు, కార్పెట్లు, చద్దర్లు, దుప్పట్లు, తినుబండారాలు, పచ్చళ్లు, తదితరాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. హైదరాబాదీ గాజులు, పట్టుచీరలు, కాలానుగుణంగా వస్తున్న సరి కొత్తడిజైన్లతో కూడిన యువతులు దుస్తులు, పిల్లలు, మెచ్చే రెడీమేడ్ దుస్తులు, వైరైటి ఆల ంకర ణ సామాగ్రి అన్ని వయస్సుల వారిని ఆకర్షించే వస్త్రాలు, మహిళలు పిల్లలను ఆకట్టుకునేందుకు గాను ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శనివారం కావడంతో సందర్శకులు అధికసంఖ్యలో తరలివ చ్చారు. బేగంబజార్‌పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

మిగిలింది ఒకరోజు ఆదివారం, సోమవారం కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలోతరలివచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎగ్జిబిషన్ సొసైటికార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు.

## తమన్‌కు ఖరీదైన కారును బహుమతిగా ఇచ్చిన నందమూరి బాలకృష్ణ




**పంజగుట్ట, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** వరుసగా నాలుగు ఘన విజయాలు అందించిన సినిమాలకు సంగీత దర్శకుడిగా వ్యవహించి ఈ విజయాలలో కీలక పాత్ర పోషించిన ప్రఖ్యాత సంగీత దర్శకుడు తమన్ కు నందమూరి బాలకృష్ణ పోర్షే కారును బహుమతిగా అందించారు. శనివారం ఉదయం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ , రీసెర్చి ఇన్స్టిట్యూట్ ఆవరణలో తమన్ కు కారు తాళాలను బాలకృష్ణ అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం కారు డ్రైవర్ సీటులో స్వయంగా కూచొని మొదటి సారి కారును స్టార్ట్ చేసి కొంత ముందుకు స్వయంగా బాలకృష్ణ నడిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తమన్ ను నందమూరి తమన్ గా అప్యాయంగా సంబోదిస్తూ ఇరువురి కాంబినేషన్ లో వరుగా వచ్చిన అఖండ, వీర సింహా రెడ్డి, భగవంత్ కేసరి, డాకూ మహారాజ్ సినిమాలు ఘన విజయాన్ని అందుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. జయాపజయాలు దైవా దీనాలైనా మేమంతా ఒక సినిమాను కలసి చేసి ఫలితంగా కోసం ఆత్రుతగా ఎదురు చూసే సమయంలో విజయం లభిస్తే ఎంతో ఆనందం పొందుతామని అటువంటిది వరుసగా నాలుగు ఘన విజయాలు అందించిన డైరెక్టర్స్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా తమన్ కు తనకు మధ్య మంచి కెమిస్ట్రీ, వైబ్రేషన్ కుదిరినట్లే ఉందని ఒక తల్లికి పుట్టకపోయినా అభిరుచులు కలిశాయని అన్నారు. నావి లార్జర్ దెన్ లైఫ్ మూవీస్ అయినప్పటికీ తమన్ అందించిన సంగీతం కారణగా ముసలి వారి నుండి చిన్న పిల్లల వరకూ అందరూ సంగీతాన్ని ఆస్వాదిస్తున్నారని అన్నారు. కొన్ని రోగాలను రాగాలతో నయం చేయగలవచ్చని అంటారని అలానే తమన్ ఇచ్చిన సంగీతంతో ఎందరిలోనో కదలికలు వచ్చి నృత్యం చేసేలా తన సినిమాల సంగీతం ఉందన్నారు. వరుస విజయాల సందర్భంలో తన తమ్ముని‌కి ఇచ్చే ఈ చిరు కానుక ఇది అని అంటూ ఇక్కడి నుండి ఇరువురం విజయవాడలో జరిగే యన్ టీ ఆర్ ట్రస్టు కాన్సర్ట్ కు వెళుతున్నామని వెల్లడించారు.

# అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**పంజగుట్ట ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకెళ్తోందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్ నగర్‌లో శనివారం రూ. 42.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేసారు. రూ. 22.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీవరేజీ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, హైదరాబాద్ నగరాన్ని సుందరంగా, స్వచ్ఛ, పచ్చ నగరంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మేయర్ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ, రోడ్డు, తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా సి సి రోడ్లు, సీవరేజీ లైన్ అభివృద్ధి పనులు తమ కాలనీలో చేపట్టడం ప ట్లప్రేమ్ నగర్ వాసులు మేయర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్ కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివకుమార్, సంబంధిత శాఖల అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పని చేయాలి : శరత్‌చంద్ర




బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయంలో జల మండలి అధికారులతో సమావేశమైన కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా పని చేయాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శనివారం కార్పోరేషన్ కార్యాలయంలో జల మండలి అధికారులు,కార్పోరేషన్ అధికారులతో నీటి సమస్యపై సమీక్షా సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ ఈ సారి ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, వాతావరణ శాఖ పేర్కొన్నదని తెలిపారు. వేసవి ప్రారంభంలోనే చాలా మంది బోర్లు ఎండిపోయి, నీటి కటకట ప్రారంభమైందని పలువురు నాయకులు నా దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఇప్పుడే సమస్య ఇలా ఉంటే వచ్చే మూడేళ్ల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, ఈ అంశంపై జల మండలి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నీటి సమస్య రాకుండా పని చేయాలన్నారు. వేసవి కాలంలో నీటి వాడకం కూడా పెరుగుతుందని, ఇప్పుడు వస్తున్న నీటి క్వాంటిటిని రెట్టింపు చేసి సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నీటి సమస్యను నిలవరించి తీరాల్సిందేనని, అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాలికలు రూపొందించుకొని పనులు చేయాలని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జల మండలి జిఎం మహేందర్‌నాయక్, డిజిఎం మహేశ్వర్, మేనేజర్ శ్రీనివాస్, డిఇఇ యాదయ్య, మేనేజర్ మంజుల, ఆర్ఓ శివకుమార్, ఏఈఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### సమగ్ర కుటుంబ సర్వే వివరాలు నమోదును సద్వినియోగం చేసుకోండి : కమిషనర్ ప్రదీప్ కుమార్

**నార్సింగి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మరోమారు సమగ్ర కుటుంబ సర్వే వివరాలు నమోదు చేసుకునే అవకాశంను కల్పించిందని, గతంలో వివరాలు ఇవ్వని వారు ఇప్పుడు సమాచారం ఇచ్చి ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని మణికొండ కమీషనర్ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ సర్వేకు సంబంధించిన దరఖాస్తు ఫారములు మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, ఈ నెల16.వ, తేదీ నుంచి 28.వ, తేదీ వరకు ఉదయం 9.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు సర్వే వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ కారణాలతో గత సర్వేలో తమ వివరాలు ఇవ్వలేని ప్రజలు ఈ సారి తప్పకుండా నమోదు చేయించుకోవాలని కమీషనర్ సూచించారు. ఈ వివరాల ఆధారంగానే ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పతకాలు వర్తింపచేయడం జరుగుతుందని వివరించారు.

## 22వేల ఆర్టిజన్లను పర్మినెంట్ చేయాలి

### ఎఐటియుసి నేత ఎస్.బాల్‌రాజ్ డిమాండ్

**సైఫాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలోని పనిచేస్తున్న 22 వేల ఆర్టిజెన్లు, సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వారంతా ఈనెల 20వ తేదీన విద్యుత్ సౌదాని ముట్టడించి, పర్మినెంట్ ఆర్డర్ ఇచ్చేంత వరకు తిష్టవేసి ఉంటారని, హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తారని ఆయన హెచ్చరించారు. సంవత్సరాలు తరబడి ఇంజనీర్ల కింద ఆర్టిజెన్లు పనిచేస్తున్నారని, వారిలో మేజార్టిగా ఇంజనీరింగ్ చేసిన వారున్నారని, నైపుణ్యం కలిగి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తు్న్నారని ఆయన శనివారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### వర్గీకరణకు చట్టబద్ధత చేసే కుట్రను మాల జాతి అడ్డుకోవాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 15 ప్రభావార్త:** ఎస్సీ వర్గీకరణకు మార్చి మాసంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో సిఎం రేవంత్‌రెడ్డి చట్టం చేసేందుకు కుట్రపన్నుతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ఈ కుట్రలను మాలలు, దళితులు అడ్డుకోవాలని, లేకపోతే మాల జాతికి భవిష్యత్తు లేదని భానిసత్వం తప్పదని శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్‌ల హక్కుల రక్షణ కోసం పోరాటం చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, ఎస్సీ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించే కుట్రను మాల ప్రజా ప్రతినిధులు అడ్డుకోవాలని, లేని పక్షంలో వారిని మాల సమాజం క్షమించదని హెచ్చరించారు.

### పార్టీ మరింత బలోపేతం చేస్తాం : ఉమామహేందర్



కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్‌ను కలిసిన గోల్కొండ జిల్లా బిజెపి నూతన అధ్యక్షులు టి.ఉమామహేందర్

**గోషామహల్,ఫిబ్రవరి 15ప్రభాతవార్త:** గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులుగా నియమితులైన టి.ఉమామహేందర్ మర్యాద పూర్వకంగా జిహెచ్ఎంసి ఫ్లోర్‌లీడర్ గొంటి శంకర్‌యాదవ్‌ను కలిశారు.ఈసందర్భంగా కార్పొరేటర్ గొంటి శంకర్ యాదవ్ నూతన అధ్యక్షులుగా నియమితులైన టి.మహేందర్‌కుమార్‌ను శాలువ కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు నియమించడం పట్ల మరింత భాద్యత పెంచిందన్నారు. జిల్లాలోని సీనియర్ బిజెపి నాయకులను సూచనలు,సలహాలు తీసుకుని పార్టీని మరింతబలోపేతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టి.కునాల్‌రావు,విజయ్‌సింగ్,పి.ముఖేష్,గోపాల్‌చారి,విశాల్‌తివారి,కె.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 6న శ్రీరామనవమి శోభయాత్ర



**బేగంబజార్,ఫిబ్రవరి 15ప్రభాతవార్త:** సీతారాంబాగ్‌లోని రామ మందిరం నుండి ఏప్రిల్ 6వ తేదిన శోభయాత్రనునిర్వహించడం జరుగుతుందని భాగ్యనగర్ శ్రీరామనవమి చైర్మన్ డాక్టర్ భగవంత్‌రావు,ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠీలు తెలిపారు. భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి చైర్మన్‌గా భగవంత్‌రావు అధ్యక్షతన హస్మత్‌గంజ్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామబాగ్‌లోని రామమందిరం నుంచి వేలాది మందిగా తరలి వచ్చే రామ భక్తులతో శ్రీరాముని శోభయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు.త్వరలోనే బహేతీభవన్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.ఈ సమావేశంలోఉత్సవ సమితి కమిటి సభ్యులు మాజీ కార్పొరేటర్ మెట్టువైకుంఠం, మహేందర్‌వ్యాస్,వై.బాబుగురు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు



పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీశ్రీశ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.



మడ్‌ఫోర్ట్‌లో సేవాలాల్ మహారాజ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



సంత్ సేవాళాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ జగన్



కిస్మత్‌పూర్‌లో జరిగిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృశ్యం



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొ.జి.నరేష్ రెడ్డి, ప్రొ.మంగునాయక్



సేవాలాల్‌మహరాజ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి



లంబాడా మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



మహరాజ్ సేవాలాల్ జయంతి ఉత్సవంలో కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్

## సబ్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

### ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా..



ప్లాన్ పరిశీలిస్తున్న సందీప్ కుమార్ సుల్తానియా

**దుండిగల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా పేర్కొన్నారు. దుండిగల్ పురపాలక సంఘం పరిధి భౌరంపేటలో సుమారు రూ.100కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న 220కెవి భారీ విద్యుత్ సబ్ స్టేషన్ ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ స్టేషన్‌పరిధి, నూతన లైన్ల ఏర్పాటు తదితర అంశాలపై ఆరా తీసి తగిన సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భౌరంపేటలో నిర్మిస్తున్న 220కెవి భారీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో చుట్టూ పక్కల 20 కిమీలకు పైగా విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. వేసవిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. భౌరంపేటలోనిసబ్ స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేసి వేసవికి ముందే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. పనుల్లో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను, త్వరితంగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిజిట్రాన్స్కో సిఎండి క్రిష్ణ భాస్కర్, టిజిఎస్పిడిసిఎల్ సిఎండి ఫరూక్అలీ, టిజిట్రాన్స్కో జెఎండి శ్రీనివాసరావు, టిజిట్రాన్స్కో డైరెక్టర్ ట్రాన్స్మిషన్ జగత్ రెడ్డి, మెట్రోజోన్ చీఫ్‌ఇంజినీర్ చిరంజీవి. టిజిఎస్పిడిసిఎల్ సిఇ మేడ్చల్ కామేష్, టిజిట్రాన్స్కో ఎస్ఇ రామ్జి, మేడ్చల్ ఎస్ఇ రవికుమార్ పాల్గొన్నారు.

## బిసిని సిఎం చేసి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి : యెర్రా కామేష్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కామేష్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీకి,రేవంత్ రెడ్డికి బీసీ లకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేసి బీసీని ముఖ్యమంత్రి చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన పేరుతో బీసీలకు అన్యాయం, అగ్రవర్ణాలకు ప్రయోజనం చేసేలా ఉందని, కులగణన అని అంటూనే వాస్తవాలను వక్రీకరించి బీసీలను మోసం చేస్తుందన్నారు. 50 శాతానికి పైగా ఉన్న బీసీలను 50 శాతానికి లోపుగా చూపించడం 2014 లో 8 శాతం ఉన్న అగ్రవర్ణాలను ఇప్పుడు 15 శాతం చూపించడం ఈడబ్లుఎస్ రిజర్వేషన్లు కాపాడుకోవడానికి ఆడుతున్న డ్రామాలన్నారు. 10సంవత్సరాలలో 21లక్షల పైగా బీసీలు చనిపోయారనడం ఎవర్ని మోసం చేయడానికి అని ప్రశ్నించారు? బిఆర్ఎస్ నేతలు కేటీఆర్,కవితలకు పదవి పోయేసరికి బీసీలు గుర్తుకు వచ్చారని బీసీల మీద బిఆర్ఎస్‌కు అంత ప్రేమ ఉంటే ముందు రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీ లకు ఇవ్వాలని కోరారు. బీసీల మొదటి ద్రోహి బిజెపి పార్టీ అని మొదటి నుండి బీసీ లకు పాలలు అందకుండా చేస్తుందని విమర్శించారు. 2011 నుండి ప్రపంచంలో జనగణన జరగని దేశం ఎదైనా ఉందా అంటే అది ఇండియా మాత్రమే అని ముందు బండి అన్న నరేంద్ర మోడీని జనగణన జరిపించాలని కోరాలని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లో ఉన్న అగ్రవర్ణ నాయకులు సామాజిక న్యాయాన్ని కలరాయడానికి చేస్తున్న కుట్రలను బీసీ సమాజం తిప్పికొట్టాలన్నారు. బీసీల పోరాటానికి జేబీపీ పూర్తి మద్దతు తెలియజేస్తున్నదని కామేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు రసపల్లి కళ్యాణ్, చెనిగరావు నిరంజన్ కుమార్,బొనెసి అభినయ్,వరుణ్ సాగర్,రాంతేజ,సందరి భాను చందర్.. తదితరులు పాల్గొన్నారు.

## గండిపేటలో వైభవంగా సాగిన ముక్తేశ్వర స్వామి పునఃప్రతిష్టాపనోత్సవాలు

### - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



గండిపేటలో జరిగిన ముక్తేశ్వర స్వామి పునఃప్రతిష్టాపనోత్సవంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** శనివారం గండిపేట గ్రామంలో జరిగిన "ముక్తేశ్వర స్వామి" పునః ప్రతిష్టాపన వేడుకలు వైభవంగా జరిగాయి. పుర ప్రముఖులు వి.ప్రశాంత్ యాదవ్ నాయకత్వంలో సాగిన ఈ వేడుకల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వనుల మధ్య యజ్ఞం, యాగం, విగ్రహ ప్రతిష్టాపనలు కన్నుల పండువగా జరిగాయి. గండిపేట గ్రామ ప్రజలంతా ఈ వేడుకల్లో పాల్గొని భక్తిసాగరంలో మునిగితేలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని తెలిపారు. ప్రతీ ఒక్కరూ దేవాలయ దర్శనంను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డ నేటి మనుషులు ఆలయాలను దర్శించుకుంటే శారీరక అలసట తీరి, మానసిక ఉల్లాసం పొందుతారని, నూతనోత్తేజంతో తమ పనులను వేగంగా పూర్తి చేస్తారన్నారు. ఆరోగ్యం రావాలంటే నడక, ప్రాణాయామం, వ్యాయామం, ఆసనాలు చేయాలని, ఆనందం రావాలంటే ఆలయాలను దర్శించుకోవాలని, ఆధ్యాత్మిక అంశాలను చదువుకోవాలని తెలిపారు. సంతోషానందాలను ఇవ్వని సంపాదనలు వ్యర్థమని, మన సంపాదన, సంతానంతో మనం సంతోషంగా గడిపే అదృష్టంను కలిగించాలని నిత్యం ఆలయాలకు వెళ్లి దేవుళ్లను ప్రార్థించాలన్నారు. వేడుకలు, పర్వదినాలు అన్నీ మన సంస్కృతి- సాంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు ఉపకరించే వారధులని వివరించారు. మన వారసులకు ఆధునిక విద్యను అందిస్తూనే ఆధ్మాత్మిక విద్యను కూడా ఒంటబట్టించే ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రామకృష్ణారెడ్డి, నర్సిహ్మా, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నాయకులు వినోద్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచే వరకు ఎవరిని వదిలేదిలేదు

### -సూర్యాపేట జిల్లాకు ధర్మాబిక్షం పేరు పెట్టాల్సిందే
### -బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



దర్మ బిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తక్షణమే అధికారికంగా దేశవ్యాప్తంగా కులగనన నిర్వహిస్తే మోడీ, రాహుల్ గాంధీల కులమేందో అధికారికంగా తెలుస్తుందని, నిజంగా బిజెపి పార్టీకి రాహుల్ గాంధీ కులం ఏమీటో తెలుసుకోవాలనుకుంటే ఈ పని చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మ బిక్షం గారి 103వ జయంతి వేడుకలు తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు కురెళ్ళ వేములయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఎల్‌బినగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై దర్మ బిక్షం చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతూ నిజాం రాజులకు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన భూమి, భుక్తి విముక్తి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మరువలేనిదని, రెండు సార్లు పార్లమెంట్ సభ్యునిగా, శాసనసభ్యులు సుదీర్ఘకాలంగా బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప యోధుడు ధర్మబిక్షం అన్ని ఆయన అన్నారు. రాష్టంలో కులగనన ఉద్యమం, స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు, తదితర డిమాండ్ల సాధన కోసం తాము నిర్విరమంగా పోరాటం చేస్తున్నామని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా దక్కాలంటే గల్లీలో ఉన్న కాంగ్రెస్, ఢిల్లీలో ఉన్న బిజెపి పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు అలాగే రాష్ట్ర అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం చట్టం చేయాలని, అదేవిధంగా ఈ చట్టం అమలు కోసం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో ఆమోదింపజేసి 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్నారు. లేని పక్షంలో తెలంగాణలో బీసీలంతా ఏకమై అగ్గి మండిస్తారని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్ దుర్గయ్య, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల రామ్ కురుమ, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రఘురాం నేత, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు పిడికిలి రాజు, నాయకులు ఆయిల వెంకన్న, నీళ్ల లింగస్వామి గౌడ్, రావులకోల్ నరేష్ ప్రజాపతి, జాజుల లింగం, ఈడిగ శ్రీనివాస్, పానుగంటి విజయ్, బొంగు వెంకటేష్ గౌడ్, పాండు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీసంగమేశ్వరస్వామివారి మహాశివరాత్రి షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు

**నాంపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన మహిమాన్విత శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీసంగమేశ్వరస్వామి వారి మహాశివరాత్రి, షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పి.లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం 24 నుండి గురువారం 27వరకు ఆలయ సంప్రదాయానుసారంగా ఈ ఉత్సవాలు జరుపబడతాయని చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రతీనిత్య హోమంతోపాటు మహాన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార రుద్రాభిషేకాధి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. రోజువారీ పూజల్లో భాగంగా 24 సోమవారం సాయంత్రం 5.30లకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋుత్విగర్వరణం, మృత్సంగ్రహణం, అంకురారోహణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, ధ్వజపటాధివాసము; 25మంగళవారం ఉదయం 8.30 నుండి యాగశాల ప్రవేశం, సోమకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ట, గణపతిహోమం, మూలమంత్రం, మూర్తిమంత్ర హోమములు, ధ్వజాధిహోమం, ధ్వజారోహణం; రాత్రి 7నుండి భేరిపూజ, భేరి తాడనము, నిత్యహోమం, నిత్యబలిహరణము, నివేదన; 26 బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 4 నుండి మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, 7.30 నుండి ఏకవార రుద్రాభిషేకములు, అర్చనలు; 9 నుండి రుద్రహోమం, మూలమంత్ర మూర్తిమంత్ర హోమం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, నివేదన; రాత్రి 7 నుండి నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ, నివేదన, 8.30 నుండి శివకళ్యాణ మహోత్సవం అనంతరం రథోత్సవములు; 27 గురువారం ఉదయం 9 నుండి అన్నాభిషేకము, 10.30 నుండి మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణము, 11 నుండి త్రిశూల స్నానము, కుంభప్రోక్షం, మధ్యాహ్నం 12 నుండి నివేదన, నీరాజనం, మంత్రపుష్పము, ఆశీర్వచనము, వేద పండిత సత్కారం, తీర్థప్రసాద వితరణతో ఉత్సవ పరిసమాప్తి జరుగుతాయని ఈఓ వివరించారు.

## సమస్యలను పక్కదారి పట్టించేందుకే ప్రధాని కులం ప్రస్తావన : ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, కొండా దేవయ్య తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:**

రాష్ట్రంలో తప్పులతడకగా సాగిన బీసీ జనగణన సమస్యను పక్కదారి పట్టించేదుకే ప్రధాని కులాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తెరపైకి తెస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. ప్రధాని మోదీ బీసీ కాదనీ, కన్వర్టెడ్ బీసీ అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, సీఎం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. బీసీల సమస్యలను పక్కదారి పట్టించేదుకు సీఎం కొత్త ఎత్తుగడ వేశారని, మోదీ బీసీ కాదని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేకుండా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. రేవంత్ వ్యాఖ్యలు దేశంలోని బీసీలను కించపర్చడం, అవమానపర్చడం వంటిదని, సీఎం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధానిగా గొప్పగా రాణిస్తుంటే అగ్రవర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. అత్యున్నతమైన ప్రధాని పదవి బీసీ నేత చేపడితే ఓర్వలేకపోతున్నారని, వాస్తవానికి మోదీ గాండ్ల కులము చెందినవారని దేశంలో బీసీలకు రక్షణ కల్పించడానికి జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ పద్ధతి కల్పించారని, విస్తృత అధికారాలు ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో బీసీలు తీవ్ర నిర్లక్ష్యానికి, అన్యాయానికి గురవుతున్నారని, బీసీ జనగణన అసంబద్ధంగా చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. బీసీలపై చిత్త శుద్ధి ఉంటే వెంటనే రీసర్వే చేయించాలన్నారు. రీసర్వే చేయకుండా ఆన్‌లైన్‌లో చెప్పాలనడం శోచనీయమని, ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని 80 ప్రశ్నలు కాకుండా 3 ప్రశ్నలు పెట్టి ఇంటింటి సర్వే చేయించాలని విజ్ఞప్తి చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు పెట్టాలని, కేంద్రం మీదకు తొసి ఊరుకుంటామంటే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు కొండా దేవయ్య, వేముల రామకృష్ణ, రాజు నేత, అనంతయ్య,సతీష్. నిఖిల్ తదితరుల పాల్గొన్నారు.

## నిమ్స్‌లో అరుదైన వ్యాధులపై వర్క్‌షాప్



**పంజగుట్ట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్తః**

ఖేకేర్ ఫర్ రేర్: టుగెదర్ వుయ్ విన్ఖి అనే పేరుతో అరుదైన వ్యాధులపై సెన్సిటైజేషన్ వర్క్‌షాప్‌ను నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఎ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ దయాగ్నస్టిక్స్ సహకారంతో శనివారం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను నిమ్స్‌లోని ఆడిటోరియంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ రేర్ డిసీజెస్, భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ యొక్క నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్ చొరవ ఆధ్వర్యంలో నిర్వహించింది. అరుదైన వ్యాధుల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా నియమించబడిన భారతదేశంలోని 12 కేంద్రాలలో నిమ్స్ ఒకటి. వర్క్‌షాప్ యొక్క ప్రాథమిక లక్ష్యం అరుదైన వ్యాధులకు రోగనిర్ధారణ పద్ధతులు, చికిత్స ఎంపికలు, నివారణ వ్యూహాల గురించి అవగాహన కల్పించడం, సమాచా రాన్ని వ్యాప్తి చేయడం. ఈ వర్క్‌షాప్‌లో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల నుండి పీడియాట్రిక్స్ , ప్రసూతిగైనకాలజీ విభాగాల నుండి నామినేట్ చేయబడిన అధ్యాపకులు పాల్గొన్నారు. నిమ్స్ డైరెక్టర్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ బీరప్ప ముఖ్య అతిథిగా, డీన్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ లిజా రాజశేఖర్ ప్రారంభ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయ్యారు. అరుదైన వ్యాధులతో బాధపడుతున్నరో గులకు సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణను అందించ డానికి మరియు సమాజంలోని అన్ని వర్గాల రోగులకు అందుబాటులో సరసమైన ధరలకు అందించడానికి నిమ్స్ నిబద్ధతను డైరెక్టర్ నొక్కి చెప్పారు. నిమ్స్‌లోని మెడికల్ జెనెటిక్స్ విభాగం ప్రొఫెసర్ అరుదైన వ్యాధులకమిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ ప్రజ్ఞా రంగనాథ్, చొరవ కింద చేపడుతున్న కార్యక లాపాల అవలోకనాన్ని , ఈ పథకం కింద రోగిలబ్ధిదారుల సారాంశాన్ని అందించారు. నిమ్స్ లోని మెడికల్ జెనెటిక్స్ విభాగం ప్రొఫెసర్ , ఇన్‌ఛార్జ్ హెడ్ డాక్టర్ షగున్ అగర్వాల్ ఈ విభాగం సాధించిన విజయాలను వివరించారు.

## నీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్దనున్న 3000 ఎంఎం దయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు, 900 ఎంఎం దయా వాల్వులు (బిఎఫ్ అండ్ ఎన్ఆర్‌వి) అమర్చనున్నారు. ఈ పనులు 17వ తేది సోమవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 18వ తేది మంగళవారం ఉదయం 6 గంటల వరకు కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో ఈ 24 గంటలు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. అంతరాయం కలిగే ప్రాంతాలు 1. ఓ అండ్ ఎం డివిజన్ 6 - ఎస్.ఆర్.నగర్, సనత్ నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారా హిల్స్, వెంగళ్ రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్. 2. ఓ అండ్ ఎం డివిజన్-9 - కూకట్ పల్లి, భాగ్యనగర్, వివేకానంద నగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భరత్ నగర్, మోతీ నగర్, గాయత్రినగర్, బాబా నగర్, కేపీహెచ్ బీ, బాలాజీ నగర్, హస్మత్ పేట్. 3. ఓ అండ్ ఎం డివిజన్-12 - చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజుల రామారం, సూరారం, ఆదర్శ్ నగర్, భగత్ సింగ్ నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ. 4. ఓ అండ్ ఎం డివిజన్ 13 - అల్వాల్, ఫాదర్ బాలయ్య నగర్, వెంకటాపురం, మచ్చబొల్లారం. డిఫెన్స్ కాలనీ, వాజ్ పేయ్ నగర్, యాప్రాల్, చాణిక్యపురి, గౌతమ్ నగర్, సాయినాథపురం. 5. ఓ అండ్ ఎం డివిజన్ 14 - చెర్లపల్లి, సాయిబాబా నగర్, రాధికా. 6. ఓ అండ్ ఎం డివిజన్ -15 - కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్ (కొన్ని ప్రాంతాలు). 7. ఓ అండ్ ఎం డివిజన్17 : హఫీజ్ పేట్, మియాపూర్. 8. ఓ అండ్ ఎం డివిజన్ -21 - కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, జవహర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం. 9. ఓ అండ్ ఎం డివిజన్-22 - నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతి నగర్, గండి మైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం. 10. ట్రాన్స్ మిషన్ డివిజన్-4 - ఎంఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్ రాక్, హకీంపేట్ ఎయిర్ ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బిబినగర్ ఎయిమ్స్. 11. ఆర్ డబ్ల్యూఎస్ ఆఫ్ టేక్స్ ప్రాంతాలు : ప్రజ్ఞాపూర్ (గజ్వేల్), ఆలేర్ (భువనగిరి), ఘన్ పూర్ (మేడ్చల్/ శామీర్ పేట్). ఈ నేపథ్యంలో అంతరాయం ఏర్పడే ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోగలరని కోరడమైనది.

